క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

మిర్యాలగూడ : విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా అధ్యాపకురాలిని వేధింపులకు గురిచేస్తున్న ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వీరన్న నాయక్ అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, శివ, అఖిల్, రాకేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ఏక్తాదివస్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మిర్యాలగూడ : రాష్ట్రీయ ఏక్తాదివస్ సందర్భంగా మంగళవారం మిర్యాలగూడ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ, పంచాయతీ సిబ్బందితో ఏక్తా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చెన్నూరి భరద్వాజ్, టీపీ రేణుక, చారి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : దామరచర్లలోని నోబుల్ పాఠశాలకు చెందిన యేగేందర్ ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బంటు కిరణ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన యేగేందర్‌ను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాస్, జిల్లా ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నూకల నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

అడవిదేవులపల్లి : దీపావళి పర్వదినం సందర్భంగా సందర్భంగా టపాసులు విక్రయించేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టాపాసులు విక్రయించే వారు ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పని సరి అనుమతి ఉండాలన్నారు. లేకుంటే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ సాధన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ తరి రాము

గుర్రంపోడు : విద్యారంగ ప్రమాణాలపై ఈ నెల 3న ఎంపిక చేసి పాఠశాలల్లో నిర్వహించే జాతీయ సాధన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఇన్విజలేటర్, ప్రధానోపాధ్యాయుల శిక్షణా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అవగాహనతో నిర్వహించాలన్నారు. ఓఎంఆర్ షీట్‌ను నింపే విధానాన్ని విద్యార్థులకు పరీక్షలకు ముందుగా వివరించాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు అయిటిపాముల యాదగిరి, గీత, కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

కేతేపల్లి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) ద్వారా అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ కార్యాలయ నోడల్ ఆఫీసర్ రాజశేఖర్ కోరారు. ఏపీజీవీబీ కేతేపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం కేతేపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఖాతాదారులు నగదురహిత లావాదేవీల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులు, మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ జగదీశ్, బ్యాంకు మేనేజర్ పెంటయ్య, సిబ్బంది అశోక్‌రెడ్డి, నగేష్, జ్యోతి, కళాకారులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

- గులాబీమయంగా మారిన మిర్యాలగూడ, దేవరకొండ



మిర్యాలగూడ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ వచ్చింది. ఈ సభకు నియోజకవర్గంలోని నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సభా ప్రాంగణానికి భారీగా తరలివచ్చారు. దీంతో పట్టణంలో ఎటూ చూసినా గులాబీమయంగా మారింది. సీఎం కేసీఆర్ హుజూర్‌నగర్ సభను నుంచి సాయంత్రం 4.20గంటలకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే భాస్కర్ రావు ఘన స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ సభాస్థలికి చేరుకోవడంతో ఒక్కసారిగా సభా ప్రాంగణమంతా హోరెత్తింది. నినాదాలు, ఈలలు, కేకలతో ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు గులాబీ జెండాలను పట్టుకొని కోలాటాలు, నృత్యాలతో హోరెత్తించారు. ఆశించిన దానికంటే ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆశ్చర్యానికి గురయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి యువకులు ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ నిర్వహిస్తూ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మరికొందరు ట్రాక్టర్లు, డీసీఎం వ్యాన్లు, ఆటోల్లో సభాస్థలికి చేరుకున్నారు. సభ విజయవంతానికి ఎమ్మెల్యే భాస్కర్‌రావు పది రోజుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలను, సమన్వయపరచడం వల్లే ఈ విధంగా సభ విజయవంతమైందని పలువురు చర్చించుకుంటున్నారు.

కళాకారుల ఆటపాటలతో..

పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్‌గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కళాకారులు చేపట్టిన ఆటపాట ప్రజలకు మరింత ఉత్సాహాన్ని తెప్పించాయి. యువకులు, మహిళలు, చిన్నాపెద్ద అని తేడా లేకుండా అధిక సంఖ్యలో ప్రజలు హాజరై కళాకారుల ఆటపాటకు ముగ్ధలయ్యారు.

పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం

సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ సందర్భంగా పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు, ఆయా మండలాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావడంతో పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. సాగర్‌రోడ్డు, పోస్టాఫీసు, మెయిన్‌బజార్, అంబేడ్కర్ విగ్రహం, హనుమాన్‌పేట, రాఘవ థియేటర్, రాజీవ్‌చౌక్ వద్ద పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు కష్టపడ్డారు. పట్టణ శివారులోనే వాహనాలను నిలిపివేయడంతో ప్రధాన రహదారులన్నీ సభకు తరలివచ్చే గులాబీ శ్రేణులతో నిండిపోయాయి.

భారీ బందోబస్తు

మిర్యాలగూడ అర్బన్ : సీఎం సభకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో భారీ కేడ్లు పెట్టి పెద్ద వాహనాలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎన్నెస్పీ క్యాంపు గ్రౌండ్‌కు వచ్చే అన్ని రోడ్లు పోలీసులు తమ ఆదీనంలోకి తీసుకుని పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ అపూర్వరావు ఆధ్వర్యంలో భద్రతను సమీక్షించారు. నలుగురు డీఎస్పీలు, 15మంది సీఐలు, 50మంది ఎస్ఐలు, 110మంది ఏఎస్ఐలతో పాటు మరో మూడు వందల మంది కానిస్టేబళ్లు విధులు నిర్వర్తించారు.



సభకు ట్రాక్టర్‌లో తరలివస్తున్న మహిళలు

సీఎం సభ విజయవంతం

దేవరకొండ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం దేవరకొండ పట్టణంలోని ముదిగొండ రోడ్డులో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. మధ్యాహ్నం 3గంటలకు రావాల్సిన ముఖ్యమంత్రి కేసీఆర్ దాదాపు రెండున్నర గంటలు ఆలస్యంగా వచ్చారు. అయినప్పటికీ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ తగ్గకుండా హుషారుగా సీఎం కోసం వేచి ఉన్నారు. అయితే సాయంత్రం 5.29 గంటల ప్రాంతంలో సభా వేదికకు చేరుకున్న సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ మిర్యాలగూడలో కొంత ఆలస్యం జరిగిందని, ఇందుకు తనను పెద్దమనసుతో నియోజకవర్గ ప్రజలు క్షమించాలని కోరారు. ఈ సభకు నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆటోలు, ట్రాక్టర్లు, సొంత వాహనాల్లో తరలివచ్చారు. సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. మధుప్రియ తన కళాబృందంతో పాటలు పాడుతున్నంత సేపు ఈలలు, కేరింతలు వినిపించాయి. దేవరకొండ పట్టణం అంతా గులాబిమయంగా మారింది.



దేవరకొండ : ప్రజా ఆశీర్వాద సభలో నృత్యాలు చేస్తున్న కళాకారులు

భారీ బందోబస్తు ఏర్పాటు

దేవరకొండలో సీఎం ప్రజాఆశీర్వాద సభ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యకర్తలను ప్రత్యేకంగా తనిఖీలు చేశాకే అనుమతించారు. మొత్తం 530మంది సిబ్బంది పాల్గొన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అలరించిన ధూంధాం..

ప్రజా ఆశీర్వాద సభ సందర్భంగా ఏర్పాటు చేసిన ధూం ధాం కార్యక్రమం అలరించింది. మధ్యాహ్నం 3.00 గంటలకు రావల్సిన ముఖ్యమంత్రి కేసీఆర్ 5.29 గంటలకు సభావేదిక వద్దకు వచ్చారు. దీంతో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి గాయనీ మధుప్రియ తమ కళా బృందంతో హోరెత్తించే పాటలతో అలరించారు. లక్ష్మి పాడిన రామక్క పాట సభికులను ఉర్రుతలూగించింది.

సీఎం సభల సైడ్‌లైట్స్

మిర్యాలగూడలో..

- ప్రజా ఆశీర్వాద సభ రెండు గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా సాయంత్రం 4.00గంటలకు ప్రారంభమైంది.
- ఉదయం 11గంటల నుంచే సభా ప్రాంగణానికి ప్రజలు తరలివచ్చారు.
- హుజూర్‌నగర్ నుంచి సాయంత్రం 4.00గంటలకు మంత్రి జగదీశ్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి సీఎం కేసీఆర్ మిర్యాలగూడకు చేరుకున్నారు.
- సీఎంకేసీఆర్‌కు శాసనమండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.
- హెలీప్యాడ్ నుంచి బస్సులో 4.12గంటలకు సభా ప్రాంగణానికి సీఎం చేరుకున్నారు.
- సభలో ముందుగా స్థానిక ఎమ్మెల్యే భాస్కర్ రావు 13 నిమిషాలు మాట్లాడారు.
- సీఎం కేసీఆర్ 4.30గంటల నుంచి 4.55 గంటల వరకు 25నిమిషాల పాటు ప్రసంగించారు.
- సీఎం మాట్లాడుతున్నప్పుడు పార్టీ కార్యకర్తలు ఈలలు కొట్టడంతో ఈలలు ఆపాలని సీఎం పదే పదే చెప్పినా కార్యకర్తలు వినలేదు. తనకు సమయం తక్కువగా ఉంది. ఈలలు కొట్టవద్దు ప్రసంగం ముగిసిన తరువాత తానూ రంగంలోకి దిగుతాను అని కేసీఆర్ అన్నాడు.
- భాస్కర్‌రావు ప్రసంగిస్తుండగానే కొంత మంది కార్యకర్తలు మధ్యలోనే తిరుగుబాట పట్టారు.
- సీఎం కేసీఆర్ ప్రసంగ సమయంలో పార్టీ కార్యకర్తలు వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

దేవరకొండలో..

- ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు మధ్యాహ్నం 2.00 గంటల నుంచే చేరుకున్నారు.
- 3.00 గంటల నుంచి గాయని మధుప్రియ తమ కళా బృందం సభ్యులు ఆట పాటలతో అలరించారు.
- మిర్యాలగూడ నుంచి దేవరకొండకు 5.27 గంటలకు సీఎం హెలిక్యాప్టరల్‌లో వచ్చాడు.
- 5.29 గంటలకు సీఎం కేసీఆర్ సభావేదికపైకి చేరుకొని ప్రజలకు అభివాదం చేశారు.
- 5.30 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభించి 5.37 గంటలకు ముగించారు. మొత్తం ఏడు నిమిషాలు మాత్రమే మాట్లాడారు.
- 5.40 నిమిషాలకు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో తిరిగి హైదరాబాదుకు వెళ్లిపోయారు.

సీఎం సభ విజయవంతంపై ఎమ్మెల్యే కృతజ్ఞతలు

మిర్యాలగూడ : బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ హాజరైన ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయడంపై ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని పట్టణంతోపాటు మాడ్గులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల నుంచి సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు భారీగా హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు, రైతులతోపాటు ఆయా వర్గాల ప్రజలకు, సహకరించిన సిబ్బందికి, ఇతరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



అరెస్టయిన బీజేపీ నాయకులు

కొండమల్లేపల్లి : దేవరకొండలో ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటున్న నేపథ్యంలో మంగళవారం పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు ఎంపీటీసీ శివ, భరత్‌కృష్ణ, అంజి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్ : అక్రమంగా మిర్యాలగూడ నుంచి మాచర్లకు తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐలు పికె రెడ్డి, సాలకమ్మలు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనల ప్రకారం తనిఖీలు చేయగా 12మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్వాధీన పరిచినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీసులు పి.వెంకన్న, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే మోటార్లకు మీటర్లు



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భగత్



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భగత్

పెద్దవూర : కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే మోటార్లకు మీటర్లు పెట్టే రోజులు వస్తాయని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డిలతో కలిసి మండలంలోని తుంగతుర్తి, రామన్నగూడెం, రామన్నగూడెంతండా, ఏనేమీదితండా, నాయినవానికుంట, నాయినవానికుంటతండా, జయరాంతండా, పర్వేదుల, పాల్తీతండా, తంగెళ్లతండా, మర్రిపురి తండాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఆనవాయితీగా తుంగతుర్తి గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి మండలంలో ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయనకు ప్రజలు డప్పువాయిద్యాలు, మంగళహారతులు, కోలాటాలతో భారీగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవినాయక్, మాజీ ఎంపీపీ అంతయ్య, నాయకులు లింగారెడ్డి, కర్ణ బ్రహ్మారెడ్డి, వాసుదేవుల సత్యానారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మునిరెడ్డి, అబ్బాస్, సైదులు, బషీర్, రామలింగయ్య, సర్పంచ్‌లు చంద్యానాయక్, విష్ణుప్రియా, లింగయ్య, దీపాచీనానాయక్, విజయబాలవద్దిరాజు, ఎండీ.హైమద్‌అలీ, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు వంగూరి కిరణ్, మండల నాయకుడు వంగూరి ఈదయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదో వార్డు సభ్యురాలు వంగూరి ప్రమీల, ఇస్రం కృష్ణమ్మ, వంగూరి కృష్ణయ్యలు మంగళవారం ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.



తుంగతుర్తిలో బతుకమ్మలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఇందిరాగాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలి

మిర్యాలగూడ : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి, సాగర్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, నాయకులు రామలింగయ్యాయాదవ్, ఉపేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సలీం, ఆరీఫ్, శ్రీనివాస్, సైదులు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, వెంకన్న, బసవయ్యాగౌడ్, లింగయ్యాయాదవ్, బక్కారెడ్డి, కోట శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

హాలియా : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ 39వ వర్ధంతిని మంగళవారం హాలియా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామేశ్వరీ, లింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, చిన బిక్షం యాదవ్, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజారమేష్ యాదవ్, కృష్ణ, శ్రీనివాస్, రాంబాబు, సైదులు, శ్రీనివాస్, పాండునాయక్, నాగరాజు పాల్గొన్నారు.



మిర్యాలగూడ : ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఎల్ఆర్

కొండమల్లేపల్లి : భారత దేశ మొదటి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, కైసర్‌ఖాన్, ముత్యాలు పాల్గొన్నారు.



హాలియా : ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 39వ వర్థంతిని మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేండ్ల భాస్కర్‌రెడ్డి, శాగం పెద్దిరెడ్డి, రాఘవరెడ్డి, చంద్రశేఖర్, సర్పంచ్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రాంరెడ్డి, రహీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

హాలియా : కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతోందని సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలంలోని పాలెం, ఇబ్రహీంపేట, త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం, కోమటిగూడెం, గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీ కార్యకర్తలు మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు లింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, చిన బిక్షం యాదవ్, చట్టారెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జైవీర్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని ఎర్రచెరువుతండా, జమ్మనకోట, చింతలపాలెం, నాయకునితండా, తిమ్మాయిపాలెం, చెన్నాయిపాలెం, గోడుమడక, నెల్లికల్లు, మూలతండా, పిల్లిగుండ్లతండాలలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ ఖాజా అజ్గర్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఉన్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వసతులు ఉన్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగు నీటి వసతులను కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ సకినాల పద్మ పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలను ఖండించాలి



మాట్లాడుతున్న పోలేపల్లి రాజేష్

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పెంచి పోషిస్తున్న వారసత్వ రాజకీయాలను బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలేపల్లి రాజేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకుల పేద ప్రజలు ఆలోచన చేసి వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. ముదిగొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ప్రసాద్ కోశాధికారి నరసింహ, విజయ, వివిధ మండలాల అధ్యక్షులు అశోక్‌నాయక్, జ్యోతి, మధుశ్రీ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ



ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం అండగా ఉండి పోరాడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కొండమల్లేపల్లిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను సాధించడానికి దేశంలో ఏర్పడిన తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని పేర్కొన్నారు. 44 కార్మిక సంఘాలను యథావిధిగా కొనసాగించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వస్కుల శ్రీను, రమావత్ సోమ్లా, ఆకులపల్లి వెంకటయ్య, భూతరాజు దాసు, గిరి, యేసు, వెంకటయ్య, పత్య, చందు, నందు, హతిరాం, శేఖర్, యాదయ్య, లక్పతి, నరేశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి

హాలియా : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పట్టణంలోని ఎంసీఎం డిగ్రీ, ఆల్ఫా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఏక్తాదివస్ సందర్భంగా విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఎం డిగ్రీ, ఆల్ఫా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల మంజులత, సాయి ప్రకాశ్, ఎన్ఎస్ఎస్ పీఓ సత్యనారాయణ, అధ్యాపకులు కొండలు, రామయ్య, గోవిందరెడ్డి, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ మంజులత

బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి నివేదితారెడ్డి

హాలియా : నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ సంఘటన మాత్ర ప్రధాన కార్యదర్శి మధుకర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియాలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితారెడ్డి మాట్లాడుతూ సాగర్‌లో 70 ఏళ్లుగా మహిళలు పోటీ చేసే అవకాశం రాలేదని, ఈ అవకాశాన్ని తనకు బీజేపీ కల్పించిందన్నారు. మీ ఇంటి బిడ్డగా, చెల్లిగా, అక్కగా భావించి తనను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చెన్ను వెంకటనారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్, గోపాల్‌రెడ్డి, సుంకర నారాయణరెడ్డి, కటకం మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే అర్హత లేదు

మాడుగులపల్లి : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే అర్హత లేదని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి రామరాజు అన్నారు. మాడుగులపల్లి మండలంలోని దాచారం, చెరువుపల్లి గ్రామాల్లో మంగళవారం గడగడపకు తిరిగి ఆయన ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలగొండ నియోజకవర్గ ప్రజలు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని ఆదరించి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఇంటికి పంపాలన్నారు. నిస్వార్థంగా సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చే వారికి ప్రజలు అండగా ఉండాలని కోరారు.